

మీర్జాపురంలో విజిలెన్స్ దాడులు

రూ.5.40 లక్షల జరిమానా

నూజివీడు టౌన్ :మండలంలోని మీర్జాపురం సెక్షన్‌లో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలను విద్యుత్ శాఖ విజిలెన్సు అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విజిలెన్స్ ఇఇ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 41 బృందాలుగా ఏర్పడి 2994 గృహ సర్వీసులు, 156 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 165 సర్వీసులకు అదనపు లోడు 270 కెడబ్ల్యూ మొత్తానికి రూ.5.40 లక్షలు విధించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే 9440812362, 9440812363, 8331014951 సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ విద్యుత్ విజిలెన్స్ తనిఖీల్లో నూజవిడు ఇఇ ఎ.సత్యనారాయణ, రూరల్ డిఇఇ ఎం.పోతురాజు, మీర్జాపురం ఎఇ కె.బాబూరావు, నూజవీడు డివిజన్ పరిధిలోని ఎఇలు, జెఇలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభకు వేళాయే..

నేటి నుంచి సిపిఎం జిల్లా మహాసభ
ఎర్రజెండాలు, తోరణాలతో ముస్తాబైన
మన్యం పురిటిగడ్డ బుట్టాయగూడెం
నేడు ప్రదర్శన, బహిరంగ సభ
14, 15 తేదీల్లో ప్రతినిధుల సభకు
200మందికిపైగా హాజరు
విచ్చేయనున్న రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిపిఎం ఏలూరు జిల్లా 26వ మహాసభకు సర్వం సన్నద్ధమైంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న మహాసభకు జిల్లా నాయకత్వం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. మన్యం పురిటిగడ్డ బుట్టాయగూడెం ప్రాంతం మహాసభకు వేదికగా మారింది. మహాసభ నేపథ్యంలో బుట్టాయగూడెం మొత్తం ఎర్రజెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో ముస్తాబైంది. రోడ్లు, మహాసభ ప్రాంగణమంతా ఎరుపురంగు పులుముకుంది. మహాసభ జరగనున్న ప్రాంతానికి ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) నగర్‌గా నామకరణం చేశారు. మూడు రోజులపాటు జరగనున్న మహాసభలో తొలిరోజు శుక్రవారం ఉదయం 12 గంటలకు కన్నాపురం పెట్రోల్ బంక్ నుంచి సినిమా హాలు సెంటర్ వరకూ మూడు వేల మందితో భారీ ర్యాలీ, ఇటుక బట్టీ ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. కొమ్ముడోలు నృత్యాలు, విల్లంబుల ప్రదర్శన, కళారూపాల ప్రదర్శన వంటి ప్రదర్శనలో ఆకర్షణీయంగా నిలవనున్నాయి. బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం ప్రసంగించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ ప్రదర్శన, బహిరంగసభలో పాల్గొనున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం తహశీల్దార్ కార్యాలయం రోడ్డు శివార్లలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. జిల్లా నలుమూలల నుంచి మహాసభకు 200 మందికిపైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. రెండో రోజు శనివారం ప్రారంభోపన్యాసం తర్వాత ప్రతినిధుల చర్చలు సాగనున్నాయి. మూడో రోజు ఆదివారం చర్చలు, ప్రజాసమస్యలపై తీర్మానాలతోపాటు నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరగనుంది. మహాసభను విజయవంతంగా నిర్వహించేందుకు గడిచిన కొద్దిరోజులుగా సిపిఎం జిల్లా నాయకత్వం విస్తృతంగా శ్రమించింది. తొలిరోజు బహిరంగ సభకు పెద్దఎత్తున జనం తరలిరావాలని జిల్లా నేతలు పిలుపునిచ్చారు. పండుగ వాతావరణంలో మహాసభ నిర్వహించేందుకు పార్టీ కేడర్ అంతా సమాయత్తమై ముందుకు సాగుతోంది.

ప్రధాన సమస్యలపై విస్తృత చర్చ..

మహాసభలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించనున్నారు. గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన పోరాటాలు, అనుభవాలు, పేద రైతులు, గిరిజనులు, దళితులు వంటి అణగారిన తరగతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపైనా చర్చించనున్నారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో ప్రజలపై విద్యుత్ భారాలు భారీగా మోపడం, హామీల అమలుపైనా సభలో చర్చలు సాగనున్నాయి. జిల్లా ప్రజానీకం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఈ సభలో చర్చించనున్నారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలపై సభలో చర్చించనున్నారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా, ఇళ్ల నిర్మాణం చేయకుండా కాపర్ డ్యామ్ పూర్తి చేశారు. 2027 నాటికి పోలవరం ప్రధాన డ్యామ్‌తో సహా పనులన్నింటినీ పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికీ కుక్కునూరు, వేలేరుపాడు మండలంలోని 20 వేలకుపైగా కుటుంబాలకు పూర్తిస్థాయిలో పరిహారం అందించని పరిస్థితి నెలకొంది. కాపర్ డ్యామ్ నిర్మాణంతో ప్రతియేటా జులై, ఆగస్టు నెలల్లో విరుచుకుపడుతున్న గోదావరి వరదలకు వేలేరుపాడు, కుక్కునూరు మండలంలోని గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 50 అడుగులకు చేరకముందే దాదాపు 35కుపైగా గ్రామాల్లోకి వరద ముంపు చేరుతోంది. దీంతో అక్కడి ప్రజలు కొండలు, గుట్టలు, పునరావాస కేంద్రాల్లో నెలలు తరబడి తలదాచుకుంటూ నానావస్థలు పడుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందుగానే పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని సిపిఎం అలుపెరుగని పోరాటం చేస్తోంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరరావు పోలవరం నిర్వాసితుల సమస్యలపై పాదయాత్ర సైతం నిర్వహించారు. ఈ మహాసభలో నిర్వాసితుల సమస్యలన్నీ చర్చకు రానున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఎల్‌టిఆర్ భూముల వివాదం వంటి గిరిజనుల సమస్యలు చర్చించనున్నారు. జిల్లా రైతాంగం, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, భూసమస్యలతోపాటు ధరల భారంతో జనం పడుతున్న ఇబ్బందులు వంటి అనేక సమస్యలు మహాసభలో కీలకంగా చర్చకు రానున్నాయి. ఆ సమస్యల పరిష్కారానికి మహాసభలో పలు తీర్మానాలు చేయనున్నారు.



జెండాలు కడుతున్న కార్యకర్తలు



సభా ప్రాంగణం వద్ద సిద్ధం చేస్తున్న ఫ్లెక్సీలు





విజయవాడలో రెండో రోజు గురువారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న జిల్లాకు చెందిన రాష్ట్ర సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, (పైన) ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి (దిగువన)

వైసిపికి గ్రంధి గుడ్‌బై

కార్యకర్తలను జగన్ పట్టించుకోవడం లేదని విమర్శ
సైకిల్ ఎక్కుతారని జోరుగా ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ వైసిపికి గుడ్‌బై చెప్పారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజీనామా లేఖను చూపారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవి.సుబ్బారెడ్డి, పలువురు జిల్లా నాయకులపై విమర్శలు ఎక్కుపెట్టారు. పార్టీ అధికారంలోకొచ్చాక రాష్ట్రాన్ని నాలుగు ముక్కలు చేసి నలుగురు నాయకులకు అప్పగించారన్నారు. రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కలిగి, జనసేన అధినేతగా ఉన్న పవన్ కళ్యాణ్‌పై తాను గెలిచినప్పటికీ పార్టీలో తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. అయినప్పటికీ ఓర్పుగానే తాను పని చేశానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టాలను జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, గత నెల ఆరో తేదీన జగన్మోహన్‌రెడ్డిని కలిసిన సమయంలో తనపై ఐటి దాడులు జరిగాయని గుర్తు చేశారు. ప్రభుత్వంపై పోరుకు వచ్చే ఏడాది మే వరకూ వేచిచూడాలని తాను కోరానని, అయితే వెంటనే పోరాటం చేయాలని చెప్పారని అన్నారు. ఈలోపుగానే జిల్లాకు చెందిన కొంతమంది నాయకులు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ తనను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల అభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని ఏ పార్టీలోకి వెళ్లాలనే దానిపై నిర్ణయం తీసుకుంటానన్నారు.



రాజీనామా పత్రాన్ని మీడియాకు చూపుతున్న గ్రంధి శ్రీనివాస్

వైసిపికి గడ్డు పరిస్థితి

వైసిపికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే గడ్డు పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రమైన ఏలూరులో ఇప్పటికే వైసిపి దాదాపుగా ఖాళీ అయ్యింది. మాజీ మంత్రి ఆళ్ల నాని, మేయర్ షేక్ నూర్జహాన్ దంపతులు, జెడ్‌పి ఛైర్మన్ గంటా పద్మశ్రీ దంపతులు వైసిపిని వీడి టిడిపి గూటికి చేరారు. ఈ క్రమంలో పశ్చిమగోదావరి జిల్లాలోనూ వైసిపి నుంచి వలసల పర్వం మొదలైంది. భీమవరం మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ రెండు నెలల క్రితమే వైసిపిని వీడతారనే ప్రచారం జరిగినా తర్వాత ఐటి దాడులతో సస్పెన్స్ నెలకొంది. ఈ క్రమంలో ఆయన తాజాగా వైసిపికి గుడ్‌బై చెప్పనున్నట్లు ప్రకటించడం ఆ పార్టీ శ్రేణుల్లో కలకలం సృష్టించింది. ఇదే బాటలో మరో ఇద్దరు మాజీ ఎంఎల్ఎలు, కొందరు నేతలు సైతం వైసిపికి గుడ్‌బై చెప్పి టిడిపిలో చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది.

తొమ్మిది మంది విద్యార్థులకు అస్వస్థత

మధ్యాహ్న భోజనమే కారణమని అనుమానం

ప్రజాశక్తి - చాట్రాయి, నూజివీడు టౌన్

చాట్రాయి మండలం కోటపాడు గ్రామంలోని యుపి పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన గురువారం వెలుగుచూసింది. దీనికి సంబంధించి ఎంఇఒ ఎస్‌విఎస్.బ్రహ్మచారి తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం బంగాళదుంప కుర్మాతో విద్యార్థులు భోజనం చేశారు. వారంతా గురువారం ఉదయం షరామామూలుగా పాఠశాలకు వచ్చారు. మధ్యాహ్నం సమయానికి కడుపు నొప్పిగా ఉందని తొమ్మిది మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం కేవలం మజ్జిగతో సరిపెట్టారు. కొద్దిసేటికే ఆరుగురు బాలికలు, ముగ్గురు బాలురకు వాంతులు కావడంతో ఉపాధ్యాయులు అప్రమత్తమై ప్రధానోపాధ్యాయిని ఎస్‌కె.షరీఫ్ మున్నీసా దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే 108 అంబులెన్స్‌లో తొమ్మిది మంది విద్యార్థులను నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారంతా ప్రస్తుతం నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారున. ఆహారం అరుగుదల కాకపోవడమే సమస్యకు కారణమని, ముందు రోజు తిన్న బంగాళాదుంప కుర్మా దీనికి కారణం కావొచ్చని వైద్యులు భావిస్తున్నారు.



నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

24న జాతీయ వినియోగదారుల దినోత్సవం

18 నుండి 24 వరకు వారోత్సవాలు - జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈ నెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు జిల్లాలో వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు 'వినియోగదారు న్యాయపాలనకు, వర్చువల్ విచారణకు డిజిటల్ సౌలభ్యం' అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని, వాటితోపాటు అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాఠశాల వినియోగదారుల క్లబ్‌లు, కాలేజీలకు సంబంధించిన విద్యార్థులు ఈ పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీలు ఇంగ్లీషు, తెలుగులో నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి రూ.15 వందలు చొప్పున నగదు బహుమతి అందజేస్తారని తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు తమ తమ పాఠశాల, కళాశాలల విద్యార్థులు విరివిగా పాల్గొనేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జెసి ధాత్రిరెడ్డి సూచించారు.



బాలల హక్కులు, సంక్షేమంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

ప్రస్తుత సమాజంలో బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, భిక్షాటన చేసే బాలలు, బాలల హక్కులు, సంక్షేమ పథకాలు, చట్టాలు గురించి జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి వివరించారు. మహిళాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పథకం ద్వారా బాలల హక్కులు, సంక్షేమ పథకాలు, చట్టాలపై అవగాహనా కార్యక్రమం నూ లయన్స్ క్లబ్, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అమలోద్భవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచక్రవేణి మాట్లాడుతూ బాలలకు ఎటువంటి సమస్య వచ్చినా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి కాల్ చేస్తే సమస్యలు పరిష్కరిస్తారన్నారు. సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్యానెల్ అడ్వకేట్ కూన కృష్ణారావు మాట్లాడుతూ బాలలపై జరిగే లైంగిక వేధింపులు నివారణ చట్టం, సెల్‌ఫోన్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రస్తుత సమాజంలో ఉన్న స్థితిగతుల గురించి వివరించారు. అమలోద్భవి స్కూల్ హెచ్‌ఎం సిస్టర్ నిర్మల, లయన్స్ క్లబ్ సివి రమణ, మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలు సమాజంలో మార్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిసిపియు సిబ్బంది పి.రాజేష్, వై.రాజ్‌కుమార్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యచక్రవేణి

64 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

అక్కడికక్కడే 96 అర్జీల పరిష్కారం
జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. జిల్లాలో భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'మీ భూమి-మీ హక్కు' పేరుతో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల వివరాలను జెసి వెల్లడించారు. జిల్లాలో 28 మండలాల్లో మొత్తం 665 రెవెన్యూ గ్రామాలుండగా గత రెండు రోజుల్లో 64 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. గురువారం నిర్వహించిన 30 రెవెన్యూ సదస్సుల్లో 1212 మంది పాల్గొని ఆయా సమస్యలపై 487 అర్జీలను అందజేశారని, వాటిలో 71 దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో అందిన విజ్ఞప్తులను 45 రోజులలోగా పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో గత రెండు రోజుల్లో నిర్వహించిన 64 గ్రామ రెవెన్యూ సదస్సుల్లో 854 అర్జీలు రాగా వాటిలో అక్కడికక్కడే 96 అర్జీలు పరిష్కరించినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి మండలానికీ జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. జనవరి 8వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు పాల్గొని తమ భూములకు సంబంధించిన సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు.

నేడు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047 ఆవిష్కరణ

జిల్లా నుంచి తరలి వెళ్లనున్న ప్రతినిధులు - ఏర్పాట్లను పర్యవేక్షించిన జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం విజయవాడలో ఆవిష్కరించనున్న స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047 కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వివిధ రంగాల ప్రతినిధులు తరలి వెళ్లనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి జిల్లా నుంచి 20 బస్సుల్లో వివిధ రంగాలకు చెందిన సుమారు వెయ్యి మంది ప్రతినిధులు వెళ్లేందుకు కలెక్టర్ వెట్రిసెల్వి సూచనల మేరకు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లా నుండి బయలుదేరి తిరిగి జిల్లాకు చేరుకునేంత వరకు సంబంధిత సమన్వయ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని జెసి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాల్లో ప్రతిభావంతులు, రైతులతో కూడిన బృందాలు విజయవాడ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల నుండి విజయవాడ వెళ్లే ప్రతినిధులకు ఏలూరులో 10 ప్రాంతాల్లో హాల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు, ఆయా పాయింట్లలో సంబంధిత ప్రతినిధులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పలువురు జిల్లా అధికారులను పర్యవేక్షక అధికారులుగా నియమించినట్లు చెప్పారు. సంబంధిత ఏర్పాట్లపై ఆయా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యమూ కలుగకుండా చూడాలని జెసి ధాత్రిరెడ్డి ఆదేశించారు.



నినదిస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎల్ఐసి ఏజెంట్లు స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. విధులు బహిష్కరించి రెస్ట్ డే పాటించారు. ఈ సందర్భంగా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూజివీడు కార్యదర్శి నాగమల్లి కుమార్, కోశాధికారి తగరం ప్రభాకర్‌రావు మాట్లాడుతూ క్లా బాక్ కమిషన్ రద్దు చేయాలన్నారు. ఏజెంట్లకు పాత పద్ధతిలో కమీషన్ ఇవ్వాలన్నారు. ఎల్ఐసి పాలసీలపై జిఎస్‌టిని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఏజెంట్లు అందరికీ మెడిక్లెయిమ్ వర్తింపజేయాలన్నారు.

గూడెంలో చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

సందడి చేసిన హీరోయిన్ మీనాక్షి చౌదరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రముఖ సినీనటి, లక్కీ భాస్కర్ సినిమా హీరోయిన్ మీనాక్షి చౌదరి తాడేపల్లిగూడెంలో చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేశారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని జివి మాల్ పక్కన నూతనంగా నిర్మించిన చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ఆమె ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మిరెడ్డి పట్టాభిరామ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడ కొత్తగా వ్యాపారాలు గానీ, ప్రారంభోత్సవాలు గానీ పెట్టలేని పరిస్థితి అని తెలిపారు. రాష్ట్రాన్ని 15 సంవత్సరాలు వెనక్కి గెంటేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసిపి ప్రభుత్వమేనని ఎంఎల్ఎ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో ఇటువంటి మాల్స్ రావడం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఉద్యోగావకాశాలు వస్తాయని తెలిపారు. సినీనటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ చిత్ర పరిశ్రమలో తనను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని తెలిపారు. షాపింగ్ మాల్ వద్ద కేరళ కథాకళి ఇతర సాంప్రదాయ నృత్య రూపకాలను ఏర్పాటు చేశారు. షాపింగ్ మాల్ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, చెన్నయ్ షాపింగ్ మాల్ యాజమాన్యం జనార్దన్ రెడ్డి, మద్రి వెంకటరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి ఉలవల బాబ్జి, బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



షాపింగ్ మాల్‌ను ప్రారంభించి వస్త్రాలను చూపుతున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి

నేటి నుంచి సిపిఎం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - చాట్రాయి

సిపిఎం 26వ జిల్లా మహాసభ 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హేలిమేరీ తెలిపారు. ఈ మహాసభలో వివిధ రంగాల కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

15న గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - చాట్రాయి

ఈ నెల 15వ తేదీ ఆదివారం స్వాతంత్ర సమరయోధులు, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు గౌడ సంఘం నూజివీడు నియోజకవర్గ నాయకులు మరీదు శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని గౌడ పెద్దలు, గౌడ సంఘీయులందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపిఎస్ ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి శ్యామ్ సుందర్ శివాజీ, పెడన ఎంఎల్ఎ కాగిత కృష్ణప్రసాద్, కొనకళ్ల బుల్లియ్య, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్, ఉమ్మడి కృష్ణా జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు వీరంకి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి అనగాని రవి, రాష్ట్ర గౌడ సంఘ పెద్దలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - కలిదిండి

సీసీ రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా మారిన ఆక్రమణలను తొలగించాలని ఆంధ్రా - తెలంగాణా రాధా రంగా మిత్ర మండలి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పన్నస పూర్ణచంద్రరావు (కాళ్లపాలెం బుజ్జి) అన్నారు. మండలంలోని కాళ్లపాలెంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన వినతిపత్రం అందించారు. ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి సచివాలయానికి వెళ్లే రోడ్డు ఆక్రమణకు గురైందన్నారు. జెడ్‌పిటిసి సభ్యులు బొర్రా సత్యవతి చొరవతో సీసీ రోడ్డుకు రూ.ఐదు లక్షలు మంజూరయ్యాయన్నారు. అధికారులు ఆక్రమణలను తొలగించి, సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పి.రంగారావు, పి.సందీప్, ఆనంద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు 33 కెవి విద్యుత్ ఉపకేంద్రానికి అనుబంధంగా ఉన్న పలు విద్యుత్ ఉప కేంద్రాల్లో ఈ నెల 13వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్ కో భీమడోలు ఎఇ తెలిపారు. ఆ ప్రాంతాల్లో పెరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న వాటి క్రమబద్ధీకరణతో పాటు, విద్యుత్ స్తంభాలపై ఉన్న పాడైన కండక్టర్ల స్థానంలో నూతన కండక్టర్లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

16న విజయవాడలో ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈ నెల 16వ తేదీన విజయవాడలో జరిగే స్వీపర్లు, ఆయాల ధర్నాను జయప్రదం చేయాలని ఎఐటియుసి ఏలూరు జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం చలో విజయవాడ ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు, ఆయాలకు రావాల్సిన ఐదు నెలల జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్వీపర్లు, ఆయాల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ధర్నాకు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మ, మంగమ్మ, రాధా, సత్యవతి పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్, ఆయాల సమస్యలపై ఈ నెల 16వ తేదీ విజయవాడ మిడ్ డే మీల్, ఆయాల స్వీపర్ల డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు తెలిపారు. సిపిఐ కార్యాలయంలో స్కూల్ స్వీపర్స్, ఆయాల చింతలపూడి మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ధర్నా వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల జీతాలను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

'రైతులకు అండగా టిడిపి కూటమి'

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడా అనీష్ కుమార్ అన్నారు. చింతలపూడిలోని మార్కెట్ యార్డ్ వద్ద అగ్రికల్చర్ ఎఒ మీనాకుమారి ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం మాట్లాడుతూ రైతులకు కావాల్సిన వ్యవసాయ అనుబంధ శాఖల విషయాలు తెలియజేస్తూ రైతు సమస్యలను అధిగమిస్తూ అధిక దిగుబడి సాధించే దిశగా రైతులకు సహకారం అందించేందుకు కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మారేడుబాక, లంకలపల్లి, కొత్త నెమలిపేట, కొత్త గుండుగూడెం గ్రామాల్లో శాఖ, గ్రామ కమిటీల సమావేశాలు గురువారం నిర్వహించారు. ఈ సమావేశాలకు పార్టీ మండల కార్యదర్శి కంగాల కల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ మాట్లాడుతూ లక్షలాది మంది పోలవరం ముంపు నిర్వాసితులకు ఆర్‌ఆర్ అవార్డు పాస్ చేసి నష్టపరిహారం ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయన్నారు. నిర్వాసితులకు ఎప్పుడు ప్యాకేజీ ఇస్తున్నారో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. నిర్వాసితులతో దశలవారీ ఆందోళన కార్యక్రమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి సోయం చంద్రరావు, ఎం.దేవయ్య, రాజు, మంగయ్య, జోగయ్య, మహేష్, చిర్మయ్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పక్కపక్క ఇళ్లలో చోరీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పక్కపక్కనే ఉన్న ఇళ్లల్లో చోరులు దొంగతనాలకు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.... నగరంలోని వట్లూరు సమీపంలో ఇంద్రప్రస్థ గేటెడ్ కమ్యూనిటీ ఉంది. వాటిలో ఇండివిజువల్ హౌసులు, గ్రూప్ హౌస్‌లు ఉన్నాయి. వాటిలో పక్కపక్కనే ఉన్న రెండు గృహాల్లో చోరీ జరిగింది. గురువారం తెల్లవారుజామున చోరులు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును కూడా అపహరించినట్లు తెలుస్తుంది. అయితే ఎంత అపహరణకు గురైందన్న అంశంపై ఇంకా గృహ యజమానులు నిర్ధారణకు రాలేదు. మూడో పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని అంకన్నగూడెం గ్రామ పరిసర ప్రాంతాల్లో గురువారం జంగారెడ్డిగూడెం డివిజన్ ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఒక మహిళ వద్ద తెలంగాణ రాష్ట్రానికి చెందిన 15 మద్యం బాటిళ్లను గుర్తించినట్లు తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

7 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని సింహాద్రిపురం గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న మట్టా శ్రీరాములు వద్ద నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ ఎం.మస్తానయ్య తెలిపారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి - కలిదిండి

స్వయం కృషితో ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం పొందిన పూర్వ విద్యార్థి వడ్డే సాయినరసింహస్వామిని కోరుకొల్లు క్రాంతి హైస్కూల్ కరెస్పాండెంట్ చెన్నంశెట్టి కృష్ణ సన్మానించారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణ మాట్లాడుతూ మండలంలో మారుమూల గ్రామమైన అవకూరులో వ్యవసాయ కుటుంబానికి చెందిన నరసింహస్వామి ఏ కోచింగ్ సెంటర్‌కి వెళ్లకుండా స్వయంకృషితో ఇంటి వద్దే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. సిబిఐ, ఎయిర్ పోర్ట్‌లోనూ ఉద్యోగ అవకాశాలు వచ్చినా ఐటి డిపార్ట్‌మెంట్‌ను ఎంచుకుని సఫలీకృతుడయ్యాడన్నారు. ప్రిన్సిపల్ అజేష్‌బాబు, ఉపాధ్యాయ సిబ్బంది నరసింహ స్వామికి అభినందనలు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ముసునూరు

నీటి సంఘాల ఎన్నికలు ఎటువంటి అవాంతరాలు, సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించాలని తహశీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 16 గ్రామాల నీటి సంఘాల ఎన్నికల నిర్వహించే విధానంపై ఆయా రిటర్నింగ్ పోలింగ్ అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శనివారం నిర్వహించే నీటి సంఘాల ఎన్నికలను ఎలా నిర్వహించాలి, ఎన్నికలు జరిగే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలి, అదేవిధంగా ఏకపక్ష నిర్ణయంతో ఎన్నికలు జరగకుండా ఉంటే ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి అనే విధానాలను యువరాజు, బి.వెంకటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిఎంపి సత్యనారాయణ మృతికి సంతాపం


సత్యనారాయణ (ఫైల్)

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురానికి చెందిన ప్రముఖ పిఎంపి వైద్యుడు తిరుపతిపాటి సత్యనారాయణ (70) ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 11వ తేదీ ఇంటి వద్ద మృతి చెందారు. ఆయన ఐదు దశాబ్దాల నుంచి గ్రామంలో వైద్యసేవలందిస్తూ తలలో నాలుకలా ఉండేవారని ఆయన మృతిపట్ల నారాయణపురం వర్తక సంఘం అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, గ్రామస్తులు, పిఎంపి అసోసియేషన్ సంతాపం వ్యక్తం చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు సంకల్ప-2025లో భాగంగా చదువులో వెనకబడిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ గురువారం పంపిణీ చేసినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బెజగం వెంకట శ్రీనివాసు వెల్లడించారు. ఇంటర్మీడియట్ కమిషనరేట్ నుంచి వచ్చిన స్టడీ మెటీరియల్‌ను కళాశాల నిర్వహణ నిధి నుంచి రూ.26 వేలతో ముద్రణ చేయించి వాటిని విద్యార్థులకు కేర్ టేకర్ ద్వారా అందించారు. కళాశాల అకడమిక్ గైడెన్స్ మానిటరింగ్ అధికారి సిహెచ్‌వివి.రామచంద్రరావు, అధ్యాపకులు కెవై.నాయుడు, కె.దుర్గయ్య, శ్రీకాంత్, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై నేడు కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

రైతు సమస్యలపై వైసిపి అధ్యక్షులు జగన్ ఆదేశాల మేరకు కలెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించనున్నట్లు కుక్కునూరు వైస్ ఎంపిపి-1 తాండ్ర రాజేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్ సెంటర్‌లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా ప్రారంభమై కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు.

ధరణి మృతికి సంతాపం

ముసునూరు: వైసిపి మండలాధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు (కొర్లగుంట నాని) పెద్ద కుమారుడు మూల్పూరి ధరణి గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని నూజివీడు మాజీ ఎంఎల్ఎ వెంకట ప్రతాప్ అప్పారావు సందర్శించి నివాళులర్పించారు. వైసిపి కోటగిరి రాజానాయన, జలగం శేషగిరిరావు, రేగుల గోపాల కృష్ణ, రేగుల నరసింహారావు, నక్కనబోయిన సత్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రూ.3 కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులు

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు ప్రజల కృతజ్ఞతలు


నిర్మాణ దశలో ఆశన్నగూడెం-బాదరాల రహదారి

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలంలోని ఆశన్నగూడెం నుంచి బాదరాల వరకు మూడు వేల మీటర్ల పొడవు ఉన్న ప్రధాన రహదారి అభివృద్ధికి చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.మూడు కోట్ల నిధులు మంజూరు చేయించి సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. 1995లో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి కోటగిరి విద్యాధరరావు ఈ రహదారిని తొలిసారిగా బిటి రోడ్డుగా అభివృద్ధి చేశారు. తర్వాత కాలంలో ఈ రహదారి పూర్తిగా పాడైపోయింది. 2000 నుంచి 2024 మధ్యలో రోడ్డుపై ఏర్పడిన గోతులు పూడ్చారు గాని రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేదు. ఈ రహదారికి అభివృద్ధి చేయాలని, కనీసం మరమ్మతులైన చేయించాలని ప్రజలు కోరుతూనే ఉన్నారు. అయినా అధికారులు, పాలకులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఈ రహదారికి శాశ్వత పరిష్కారం చూపుతున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారూ రూ.మూడు కోట్ల నిధులు మంజూరు చేయించి మూడు వేల మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దాదాపుగా 75 శాతం రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో 25 శాతం పనులు నిర్మాణ దశలో ఉన్నాయని పోలాసిగూడెం, బాదరాల గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈ రహదారిని అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయించిన ఎంఎల్ఎకు నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలా కృషి

ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు


మాట్లాడుతున్న ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - భీమడోలు

నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి క్షత్రియ సేవా సమితితో పాటు ఇతరులు ఇచ్చే సలహాలు, సూచనలు స్వీకరిస్తానని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని పోలసానిపల్లి గ్రామంలో గురువారం క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఉంగుటూరు ఎంఎల్ఎతో పాటు, టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, క్షత్రియ సేవా సమితి డైరెక్టర్ వాసురాజులను సత్కరించారు. కార్యక్రమాన్ని క్షత్రియ సేవా సమితికి చెందిన పేరిచర్ల కృష్ణంరాజు నిర్వహించారు. పోలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని, దీనిలో భాగంగా సిఎం చంద్రబాబుతో పాటు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన భీమడోలు మండలాధ్యక్షులు పత్తి మదన్, ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నాణ్యతలో అశ్రద్ధ వహిస్తే చర్యలు

రోడ్ల నిర్మాణ పనులు పరిశీలించిన ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్


నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - పెదపాడు

అభివృద్ధి పనుల నాణ్యతపై అశ్రద్ధ వహిస్తే ఉపేక్షించబోమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడులో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్ల నిర్మాణ పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్, సత్వరమే తన తీరు మార్చుకోవాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడినా, అవినీతి, అలసత్వాలకు పాల్పడినా సహించబోమని రోడ్ల నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు సంస్థ ప్రతినిధులకు సూచించారు. గతంలో చేయని పనులకు బిల్లులు పెట్టడం, నాణ్యత లేని పనులు చేసి ప్రజాధనాన్ని దోచుకుని దగా చేసిన వైసిపి అవినీతి ప్రభుత్వం వంటిది తమ కూటమి ప్రభుత్వం కాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎక్కడైనా అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించిన సహించబోమని హెచ్చరించారు.

సుస్థిర అభివృద్ధి అంశాలపై శిక్షణ

ప్రజాశక్తి - భీమడోలు

సుస్థిర అభివృద్ధి అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల సారాంశాన్ని గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు అవగాహన చేసుకుని వాటిని గ్రామపంచాయతీల అభివృద్ధికి అన్వయించుకుని గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని భీమడోలు ఎంపిడిఒ, శిక్షణా తరగతుల కోర్సు డైరెక్టర్ పద్మావతి దేవి కోరారు. శిక్షణా తరగతులను రెండు విడతలగా విభజించి తొలుత తొమ్మిది గ్రామ సచివాలయాలకు వర్తింపజేసి, వారికి రెండు రోజులపాటు తరగతులను కొనసాగనించనున్నామన్నారు. దీనిలో భాగంగా గురువారం ఏడు గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై తరగతుల మొదటి రోజు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, మహాత్మ గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న తరగతుల్లో తొలిరోజు తొమ్మిది అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు అవగాహన కల్పించామన్నారు.

నిడమర్రు :పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు, మండల లెవెల్ అధికారులకు, సచివాలయ సిబ్బందికి రాష్ట్రీయ గ్రామ సౌరాజ్ అభియాన్ ఆధ్వర్యంలో నిడమర్రు మండల కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ విజయకుమారి మాట్లాడుతూ 2030 నాటికి ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు.

చింతలపూడి :అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో స్థానిక సుస్థిరత సాధించాలని చింతలపూడి ఎంపిపి డాక్టర్ రాంబాబునాయక్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద మండల అధికారులతో పంచాయతీ రాజ్ డవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల బలోపేతంపై బడ్జెట్ ప్రణాళికలు అవసరమన్నారు. గ్రామాలాభివృద్ధికి ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో విధులను నిర్వహించాలన్నారు. కష్టపడి పనిచేసే సిబ్బందికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ శిక్షణా శిబిరం వల్ల 2030 నాటికి గ్రామాలాభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా నడుచుకోవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపిడిఒ మురళీకృష్ణ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరంలో ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్ మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఉంగుటూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిపి గంటా శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఎంపిడిఒ జిఆర్.మనోజ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రెవెన్యూ సదస్సులను భూ యజమానులు వినియోగించుకోవాలని తహశీల్దార్ టిఎస్.సాయిబాబా తెలిపారు. మండలంలోని అప్పలరాజుగూడెంలో గురువారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో అందే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

చింతలపూడి : పట్టాదారు పాస్ పుస్తకం అడంగల్‌లో పేరు తప్పులు, సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవచ్చని చింతలపూడి తహశీల్దార్ ప్రమాద్వర అన్నారు. మండలంలోని చింతపల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే, రీసర్వే సమస్యలు భూతగాదాలు, పుంత దారి ఆక్రమణలు, తదితర సమస్యలపై రెవెన్యూ సదస్సులు అర్జీ పెట్టుకుంటే వెంటనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. చింతపల్లిలో అంగన్వాడీ కేంద్రానికి దారి సమస్యను గ్రామ సర్పంచి తాండ్ర రామకృష్ణ కూటమి నాయకులతో కలిసి పరిష్కరించారు.

జీలుగుమిల్లి : భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు చెప్పారు. మండలంలోని జగన్నాధపురంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే టిడిపి కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూ సమస్యలపై తొమ్మిది అర్జీలు వచ్చినట్లు ఇన్‌ఛార్జి డిప్యూటి తహశీల్దార్ జి.ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

భీమడోలు :రెవెన్యూ సదస్సుల సేవలను వినియోగించుకోవాలని రెవెన్యూ సదస్సుల మండల ప్రత్యేకాధికారి, బిసి సంక్షేమ జిల్లా అధికారి ఆర్.నాగమణి కోరారు. మండలంలో రెవెన్యూ సదస్సులు గురువారం ప్రారంభమయ్యాయి. గుండుగొలను రెవెన్యూ గ్రామ పరిధిలో నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా సంబంధిత విభాగ ప్రత్యేకాధికారి హాజరయ్యారు. భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న సదస్సులో 49 సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సదస్సులో 42 వినతులు రాగా, వాటిలో 26 వినతులను తక్షణమే పరిష్కరించామని, మిగిలిన వాటిని త్వరలో పరిష్కరించనున్నామని తెలిపారు.

మండవల్లి : భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవడానికి మంచి వేదిక రెవెన్యూ గ్రామ సభలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ గోపాల్ అన్నారు. మండలంలోని నందిగామ లంకలో రెవెన్యూ గ్రామసభను గురువారం నిర్వహించారు. ఈ గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను తీసుకొచ్చి విధిగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ధర్మారావు, ఆర్ఐ కిరణ్‌కుమారి, దేవస్థాన ఇఒ వంశీ, గ్రామ రెవెన్యూ అధికారి సింహాచలం పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల తేదీల మార్పులు

పోలవరం: మండలంలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సుల తేదీలను మార్పులు చేసిన విధంగా కొనసాగుతాయని తహశీల్దార్ సాయిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న జిల్లెల్లగూడెం పంచాయతీ నాగంపాలెంలో జరగాల్సిన గ్రామ రెవెన్యూ సదస్సును 17వ తేదీకి మార్చినట్లు తెలిపారు. 17వ తేదీన పట్టిసీమ, వెంకటాపురం గ్రామాల్లో జరగవలసిన సదస్సులను 13వ తేదీకి మార్చినట్లు తెలిపారు. పట్టిసీమలో జరిగే రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొంటారని తెలిపారు.

మహారాజశ్రీ గౌరవ మోటార్ యాక్సిడెంట్స్ క్లయిమ్స్ ట్రిబ్యునల్ మొదటి అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి వారి కోర్టు ఖమ్మం
యమ్.వి.ఓ.పి.నెం.219/2024

బిట్వీన్:
1) రావుల లక్ష్మీ
2) రావుల రమేష్ ...క్లయిమ్ పిటీషనర్స్
మరియు
1) వంకా రాంబాబు మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

నోటీసు

ఆర్2: మద్దిపాటి శ్రీను, తండ్రి వీరాస్వామి, వయస్సు: 38 సం॥, వృత్తి:ఓనర్ ఆఫ్ క్రైం వెహికల్ లారీ బేరింగ్ నెం. AP-05-W-9259 నివాసం: ఇం.నెం.7-104, వాటర్ ట్యాంక్ వీధి, పరింపుడి గ్రామం, కొయ్యలగూడెం మండలం, వెస్ట్‌గోదావరి జిల్లా-534312, A.P

పైన తెలిపిన క్లయిమ్ పిటీషనర్స్, రెస్పాండెంట్ నెం.2 అయిన మీపై మోటారు వాహన ప్రమాద నష్టపరిహారం కొరకు పైన తెలిపిన కోర్టు వారి సందు దావా దాఖలు పరిచినారు. ఇట్టి దావాలో మీ హాజరు కొరకు ది.07-01-2025న వాయిదా ఉన్నది. ఆ రోజున మీరు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని ది.07-01-2025న ఉ॥గ॥.10-30 ని॥లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరుకాగలరు. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

//కోర్టువారి అనుమతితో//
తుళ్ళూరి కృష్ణారావు,
న్యాయవాది, ఖమ్మం,
సెల్:9959583995

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

Roc.No.2422/E1/2023-24 **Dated : 12.12.2024**

Sl. No.	Name of the work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1.	Supply and delivery of Water Tankers, Street Lights, new UPS and Repairs to Computers for Tadepalligudem Municipal Office - 11 No-11	General	55.56	13.12.2024	19.12.2024

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site **https: //tender.ape.procurement.gov.in.**

Sd/- **Commissioner,** Tadepalligudem Municipality.

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ సివిలు జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో
O.S.No.7/2020

Between:
నూలినాగ రామాంజనేయ ఉషారాణి ...వాది
మరియు
ఘంటా కాశీ విశ్వేశ్వరరావు (Died) మరియు నలుగురు ...ప్రతివాద్లు
D4: Ghanta Mahesh, S/o.Kasi Visweswara Rao, D.No.1-79, కత్తవపాడు, ఇరగవరం మండలం, ప.గో.జిల్లా.
D5: Ghanta Sasi Sai Tulasi, D/o.Kasi Visweswara Rao, D.No.1-79, కత్తవపాడు, ఇరగవరం మండలం, ప.గో.జిల్లా.

యిందుమూలముగా 4 మరియు 5 ప్రతివాద్లుకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు దావాలో పైకోర్టు వారి ద్వారా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, మహారాజ శ్రీ కోర్టు వారు 4 మరియు 5 ప్రతివాద్లుకు సమన్లు అమలు నిమిత్తము పేపరు పబ్లికేషను ఆర్డరు వేసినారు. కావున యీ పేపరు ప్రకటన తేది నుండి **30 రోజులలోగా** పై తెల్పిన కోర్టు వారి ఎదుట స్వయముగా గాని Advocate గారి ద్వారా గాని హాజరయి తమ అభ్యంతరములు దాఖలు చేసుకోవలెను. ఇందుకు తప్పే యెడల పై నెంబరు దావా మీ పరోక్షమందు తీర్మానింప బడునని తెలియచేయడమైనది.

(శ్రీకోర్టు ఉత్తర్వుల మేరకు)
సి.యస్.వి.యస్.బుస్సీ
తణుకు వాది తరపు అడ్వకేటు
ది.12-12-2024 సెల్: 9989567750

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A.No:2147/2024 In O.S.No: 99 of 2024

Between:
పిటిషనర్/వాది: చోడవరపు. సాయి రమేష్
And
రెస్పాండెంట్/ప్రతివాది:
కొప్పినేని. సుధీర్ కుమార్ @ సుధీర్
రెస్పాండెంట్/ప్రతివాది అడ్రసు:
కొప్పినేని సుదీర్ కుమార్ @ సుధీర్, S/o.మహేశ్వరరావు, వయస్సు: 36 సం.లు, ఫ్లాట్ నెంబర్: 202, వెంకటాద్రి టవర్స్, శ్రీకృష్ణ దేవరాయ కళ్యాణ మండపం దగ్గర, SBI కాలనీ, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, భీమవరం సివిల్ కోర్ట్స్, పిన్ కోడ్:534201.

పై నంబరు పిటిషన్‌కు సంబంధించి రెస్పాండెంట్/ప్రతివాది అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారా నేరుగా అలాగే రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన పై పిటిషన్ నోటీసులు, సెక్యూరిటీ నోటీసులు, అటాచ్మెంట్ నోటీసులు తీసుకోకుండా ఉద్దేశ పూర్వకంగా తప్పించుకొనుచూ కాలయాపన చేస్తున్నాడు. కావున పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటిసులు ఇవ్వడమైనది. కావున సదరు రెస్పాండెంట్/ప్రతివాది **ది.09-01-2025** సంవత్సరం తేదీన ఉదయం గం.10:30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలెను, లేనియెడల సదరు రెస్పాండెంట్/ప్రతివాది పరోక్షమందు (Ex-Parteగా) పై పిటిషన్ తీర్మానించబడును.

సొరపల్లి సత్య నరేష్ కుమార్,
మట్టా చంద్ర శేఖర బాబు (వంశీ),
న్యాయవాదులు, భీమవరం
Place : భీమవరం, Ph:9781123789
Date :13-12-2024 9989928115.

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No: 99 of 2024

Between:
వాది: చోడవరపు. సాయి రమేష్
And
ప్రతివాది: కొప్పినేని. సుధీర్ కుమార్ @ సుధీర్
ప్రతివాది అడ్రసు:
కొప్పినేని సుదీర్ కుమార్ @ సుధీర్, S/o.మహేశ్వరరావు, వయస్సు: 36 సం.లు, ఫ్లాట్ నెంబర్: 202, వెంకటాద్రి టవర్స్, శ్రీకృష్ణ దేవరాయ కళ్యాణ మండపం దగ్గర, SBI కాలనీ, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, భీమవరం సివిల్ కోర్ట్స్, పిన్ కోడ్:534201.

పై నంబరు దావాకు సంబంధించి ప్రతివాది అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారా నేరుగా అలాగే రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన దావా సమన్లు తీసుకోకుండా ఉద్దేశపూర్వకంగా తప్పించుకొనుచూ కాలయాపన చేస్తున్నాడు. కావున పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా సమన్లు ఇవ్వడమైనది. కావున సదరు ప్రతివాది **ది.09-01-2025** సంవత్సరం తేదీన ఉదయం గం.10:30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలెను, లేనియెడల సదరు ప్రతివాది పరోక్షమందు (Ex- Parteగా) పై దావా తీర్మానించబడును.

సొరపల్లి సత్య నరేష్ కుమార్,
మట్టా చంద్ర శేఖర బాబు (వంశీ),
న్యాయవాదులు, భీమవరం
Place : భీమవరం, Ph:9781123789
Date :13-12-2024 9989928115.

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ సివిలు జడ్జి (జూనియర్ డివిజన్) తణుకు కోర్టులో
O.S.No.233/2019

Between:
నూలినాగ సుబ్బ సూర్య శ్యామలమణి ...వాది
మరియు
ఘంటా కాశీ విశ్వేశ్వరరావు (Died) మరియు నలుగురు ...ప్రతివాద్లు
D4: Ghanta Mahesh, S/o.Kasi Visweswara Rao, D.No.1-79, కత్తవపాడు, ఇరగవరం మండలం, ప.గో.జిల్లా.
D5: Ghanta Sasi Sai Tulasi, D/o.Kasi Visweswara Rao, D.No.1-79, కత్తవపాడు, ఇరగవరం మండలం, ప.గో.జిల్లా.

యిందుమూలముగా నాలుగు మరియు ఐదవ ప్రతివాద్లుకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు దావాలో మహారాజశ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మహారాజశ్రీ కోర్టు వారు సమన్లు 4 మరియు 5 ప్రతివాద్లుకు అమలు నిమిత్తము పేపరు ప్రకటన ఆర్డరు వేసినారు. కావున ఈ పేపరు ప్రకటన తేదీ నుండి **30 రోజులలోగా** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, Advocate ద్వారా గాని హాజరయి అభ్యంతరములు తెలుపుకొనవలెను. ఇందుకు తప్పే యడల మీ ఇరువురి పరోక్షమునందు దావా తీర్మానింపబడునని యిందుమూలముగా తెలియ చేయడమైనది.

(శ్రీకోర్టు ఉత్తర్వుల మేరకు)
సి.యస్.వి.యస్.బుస్సీ
తణుకు వాది తరపు అడ్వకేటు
ది.12-12-2024 సెల్: 9989567750